క్లుప్తంగా

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

కురుమ సంఘం మండల అధ్యక్షుడు నరేందర్



మొయినాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కురుమ సంఘం మండల అధ్యక్షుడు దర్గ నరేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని వాగ్దానం చేసిందన్నారు. ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేయాలన్నారు. జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు రిజర్వేషన్లు ఇస్తే తప్పేముందన్నారు. త్వరలో జరగబోయే గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపాలిటీల ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట వేయాలన్నారు. లేదంటే దీనిపై ప్రభుత్వంతో పోరాడేందుకు బీసీలంతా సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

షాబాద్: గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో మైక్రోసాఫ్ట్‌కు చెందిన యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ ఎన్జీవో ఆధ్వర్యంలో నగరంలోని మా ఆస్పత్రి ఉచిత వైద్య శిబిరం నిర్వహించింది. ఇందులో 110 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఖాజామీయా, నాయకులు యాదయ్య, శ్రీరాములు, బురాన్, రవి, ప్రవీణ్‌కుమార్, మహేష్, సతీష్, గౌస్‌పాషా, బాలయ్య, ఎండీ షాహిద్, ఏపీరెడ్డి, శేఖర్, ఎన్జీవో ప్రతినిధులు, వైద్య బృందం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో వీధి దీపాల ప్రారంభం



పద్మావతి కాలనీలో నూతనంగా వీధిదీపాల ప్రారంభం

మొయినాబాద్‌రూరల్: అంధకారంలో మగ్గుతున్న మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్ పద్మావతి–2 కాలనీలో నూతనంగా వీధి దీపాలను ఏర్పాటు చేశారు. వీటిని శుక్రవారం మున్సిపల్ అధికారి సంధ్యారాణి విద్యుత్ సిబ్బందితో పాటు కాలనీ కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఇటీవల కమిటీ సభ్యులు కమిషనర్ ఖాజా మొహిజుద్దీన్‌ను కలిసి వినతిపత్రం ఇవ్వగా.. అందుకు స్పందించి వీధి దీపాలను ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో కాలనీ కమిటీ చైర్మన్ జనార్దన్, సభ్యులు రవియాదవ్, ప్రభాకర్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణంతో ఆధ్యాత్మిక శోభ

కడ్తాల్: ఆలయాల నిర్మాణంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ విరాజిల్లుతుందని, భక్తి భావం పెంపొందుతుందని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మండల పరిధి కాన్గుబావితండాలో నిర్మిస్తున్న తుల్జాభవాని అమ్మవారి ఆలయానికి రూ.21,116ల విరాళాన్ని ఆయన.. ఆలయ నిర్వాహకులకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మాజీ ఉప సర్పంచ్ పాండునాయక్, నాయకులు గోప్యానాయక్, శ్రీను, బాలు, రాజు, కిషన్ ఉన్నారు.

ధర్మాస్పత్రిలో సౌకర్యాలు కల్పించండి



మెడికల్ అధికారితో మాట్లాడుతున్న ఐద్వా నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఎల్మినేడు ప్రభుత్వ ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు మంకాల విజయమ్మ కోరారు. శుక్రవారం మండల పరిధి ఎల్మినేడు ఆస్పత్రిని ఆమె పరిశీలించి మాట్లాడారు. తుర్కగూడ, ఎల్మినేడు, జబ్బార్‌గూడ, మాదాపురం, పోచారం గ్రామాల నుంచి ఇక్కడికి వైద్య చికిత్స కోసం వస్తుంటారని, రోగుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. అటెండర్, స్వీపర్‌ను నియమించాలన్నారు. ఆమెతో పాటు ఐద్వా మండల కార్యదర్శి దేవరకొండ ఇందిర ఉన్నారు.

తీరు మారదు.. తిప్పలు తప్పవు

కొత్తూరులో ట్రాఫిక్ సమస్య



ఎస్‌బీఐ ఎదుట రెండు వరుసలుగా నిలిపిన కార్లు, బైకులు

కొత్తూరు: కొందరు వాహనదారుల నిర్లక్ష్యం కారణంగా కొత్తూరు పట్టణంలో తరచూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గతంలో రోడ్లు ఇరుకుగా ఉన్న సమయంలో ట్రాఫిక్ తీవ్రత మరింత ఎక్కువగా ఉండేది. ఇటీవల రోడ్లను వెడల్పు చేసినప్పటికీ పలువురు తమ వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. తరచూ ట్రాఫిక్, సివిల్ పోలీసులు రోడ్డు నిబంధనలపై వ్యాపారులు, వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నప్పటికీ లాభం లేకుండా పోయింది. దీంతో వారు రోడ్డుపై నిలిపిన వాహనాలకు చలానాలతో సరి పెడుతున్నారు.

ఇష్టారాజ్యంగా పార్కింగ్

పట్టణంలోని కొత్తూరు–జేపీదర్గా, కొత్తూరు–పెంజర్ల, ఎస్‌బీఐ బ్యాంకు ఎదురుగా వాహనాలు పదుల సంఖ్యలో పార్కింగ్ చేస్తున్నారు. రోడ్ల విస్తరణ పెరిగినప్పటికీ పార్క్ చేయడంతో ఎదురెదురుగా రెండు వాహనాలు వెళ్లని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా బ్యాంకుకు వచ్చే వారు, ఆయా దుకాణాలకు వచ్చే వారు తమ వాహనాలను నిర్లక్ష్యంగా రోడ్డుపైనే వదిలేస్తున్నారు. ముఖ్యంగా పట్టణంలో వ్యాపార సముదాయాల నిర్వాహకులకు తమ దుకాణాల ఎదుట పార్కింగ్‌కు స్థలం లేదు. కొందరికి స్థలం ఉన్నప్పటికీ దాన్ని కూడా చిరు వ్యాపారులకు అద్దెకు ఇచ్చారు. దీంతో తప్పని సరి పరిస్థితుల్లో వాహనదారులు రోడ్లపైనే రెండు వరుసలుగా పార్కింగ్ చేస్తున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్, స్థానిక పోలీసులు స్పందించి పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

రాబోయేది బీజేపీ ప్రభుత్వమే

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



బీజేపీ పార్టీలో చేరిన యువకులతో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం

చేవెళ్ల: రాష్ట్రంలో రాబోయే రోజుల్లో బీజేపీ ప్రభుత్వమే వస్తుందని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్. రత్నం అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మున్నూరు శ్రీకాంత్ ఆధ్వర్యంలో శుక్రవారం ఈర్లపల్లి గ్రామానికి చెందిన పలువురు యువకులు బీజేపీలో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ కేంద్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఆకర్షితులు అవుతున్నారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనతో దేశం అభివృద్ధి పథంలో నడుస్తుందని చెప్పారు. భవిష్యత్తు బీజేపీదేనని గుర్తిస్తున్న నాయకులు, యువకులు పార్టీలోకి చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మహేందర్ రెడ్డి, బంటిగౌడ్, సతీష్, పాండు, నిఖిల్, శివకుమార్, అక్షయ్‌గౌడ్, వేణు, శివ, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కేశంపేట: మండల కేంద్రానికి చెందిన సంబ పురుషోత్తం గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, గుండ్రాతి రమణయ్యగౌడ్‌లు రూ.ఐదు వేల చొప్పున, తలసాని ఎల్లారెడ్డి రూ.నాలుగు వేలు, పవన్‌కుమార్‌రెడ్డి రూ.మూడు వేల నగదు అందించారు.

సీఐని కలిసిన చేవెళ్ల కమిషనర్



సీఐ భూపాల్‌శ్రీధర్‌కు మొక్క అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశం

చేవెళ్ల: మున్సిపాలిటీకి నూతన కమిషనర్‌గా నియమితులైన ఎస్.వెంకటేశం స్థానిక సీఐ భూపాల్ శ్రీధర్‌ను కలిశారు. శుక్రవారం ఉదయం సీఐని మర్యాద పూర్వకంగా కలిసి చేవెళ్ల మున్సిపల్ అభివృద్ధికి కలిసి పనిచేద్దామని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు రాఘవేందర్, ఏఈ ప్రభాకర్, నరేందర్, కాంగ్రెస్ నాయకుడు క్రిష్టారెడ్డి తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఆమనగల్లు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో ముర్తుజపల్లి వాసి కాలె మహేందర్ మృతి చెందాడు. ఈ మేరకు శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను అదే గ్రామానికి చెందిన ఫ్రెండ్స్‌యూత్ సభ్యులు పరామర్శించారు. అనంతరం రూ.25 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్‌యూత్ సభ్యులు సుభాష్, రాజు, అంబేడ్కర్, స్వామి, యాదయ్య, బాలయ్య, కార్తీక్, సాయి, విక్రం, శ్రీకాంత్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

బీసీసేన మండల కమిటీ నియామకం



చెన్నయ్యకు నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

కొందుర్గు: జాతీయ బీసీ సేన మండలాధ్యక్షుడిగా బోయ చెన్నయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి జాతీయ బీసీ సేన అధ్యక్షుడు బర్క కృష్ణయ్య హాజరై మాట్లాడారు. బీసీలందరూ ఏకమైతేనే హక్కులను సాధించుకోవచ్చన్నారు. బీసీలు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రాణించాలని సూచించారు. అనంతరం బీసీ సేన మండల కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీసీసేన జిల్లా అధ్యక్షుడు సదర్ శ్రీనివాస్, నాయకులు చంద్రశేఖర్, జయ, శ్రీకాంత్, వెంకటేష్, సుధాకర్, నరేష్, వరలక్ష్మి, శ్రీనివాస్, సౌజన్య పాల్గొన్నారు.

మత్తువద్దు.. భవిష్యత్తు ముద్దు

- దురలవాట్లకు దూరంగా ఉండండి
- ఎక్సైజ్ సీఐ సీతారాంరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: మత్తు పదార్థాలకు బానిస అయితే.. భవిష్యత్తు అంధకారం అవుతుందని, విద్యార్థి దశ నుంచే వాటికి దూరంగా ఉండాలని ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ సీఐ సీతారాంరెడ్డి అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేఖ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఆదిబట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌లోని ఓ పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్ ఒక వ్యక్తిని మాత్రమే కాదని, ఒక కుటుంబాన్ని నాశనం చేస్తుందని తెలిపారు. దాని బారిన పడినవారిని సమాజం చీత్కరిస్తుందని హెచ్చరించారు. పిల్లల భవిష్యత్తు కోసం డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టడానికి పెద్దలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీనివాసరావు, ప్రిన్స్‌పాల్ రాధిక, ఎక్సైజ్ పోలీసులు గణేశ్, మోహన్, శివాని తదితరులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి

యాచారం: యువత సన్మార్గంలో నడవాలని సీఐ నందీశ్వర్‌రెడ్డి సూచించారు. మత్తు పదార్థాలకు బానిసైతే.. భవిష్యత్తు అంధకారం అవుతుందని తెలిపారు. శుక్రవారం స్థానిక యువతతో సీఐ మాట్లాడారు. విద్యార్థి, యువత దశ ఎంతో కీలకమైందని, ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అతివేగం ప్రమాదకరమని, వాహనదారులు ప్రతి ఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలని చెప్పారు. రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం రూరల్: డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పిస్తున్న సీఐ సీతారాంరెడ్డి



యాచారం: యువతతో మాట్లాడుతున్న సీఐ నందీశ్వర్‌రెడ్డి

ఉపాధి పనుల్లో వేగం పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ శరణ్ గౌతమ్

కొందుర్గు: ఉపాధి హామీ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఏపీడీ శరణ్ గౌతమ్ సూచించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన ఉపాధి సిబ్బంది సమీక్షా సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పాడి రైతులకు పశువుల పాకతో పాటు గొర్రెలు, మేకలు, కోళ్లకు సంబంధించిన షెడ్‌లు నిర్మించుకునేందుకు హామీ పథకంలో అవకాశం ఉంటుందన్నారు. ఈ విషయమై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా అజోలా, నాడెప్ షెడ్ నిర్మాణం, వాటి ఉపయోగాలను వివరించాలని సూచించారు. ఉపాధి పనుల లక్ష్యాన్ని పూర్తి చేయడం కోసం పంచాయతీ కార్యదర్శులు శ్రద్ధ చూపాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ లక్ష్మి అనురాధ, ఏపీఓ నర్సింగ్ రావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



శంకర్‌పల్లి: మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు



చేవెళ్ల: కమిషనర్ వెంకటేశంను శాలువాతో సన్మానిస్తున్న సీఐటీయూ నాయకులు

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

కమిషనర్‌కు సీఐటీయూ నేతల వినతి

చేవెళ్ల: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం చేవెళ్ల మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటేశంను సీఐటీయూ, మున్సిపల్ యూనియన్ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయనతో మాట్లాడుతూ.. కార్మికులకు జీవో 60 ప్రకారం మెరుగైన వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్ బీమా సౌకర్యాలను కల్పించాలని కోరారు. కమిషనర్ స్పందిస్తూ.. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. అనంతరం శాలువాతో కమిషనర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ప్రభుదాస్, జనార్దన్, నర్సింహ, దస్తగిరి, విమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి

శంకర్‌పల్లి: కార్మికులకు కనీస వేతనం రూ.25 వేలు ఇవ్వాలని మున్సిపాలిటీ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రమావత్ సక్కునాయక్ అన్నారు. ఈ మేరకు శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ యోగేష్‌కు శుక్రవారం మున్సిపల్ కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం ఇవ్వడంతో పాటు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఇచ్చే సబ్బులు, షాంపులు, నూనె, చీపుర్లు, బట్టలు తదితర వాటిని ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి గోపాల్‌రెడ్డి, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు జె.అంజయ్య, నాయకులు అంతయ్య, చంద్రమౌళి, నాగేశ్, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టు తప్పిందా.. ప్రాణాలు గోవిందా!



నందిగామ: ప్రైవేట్ ఆటోలు, వాహనదారుల డ్రైవర్లు కొందరు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. సంపాదనే ధ్యేయంగా కనీస నిబంధనలను నీరుగారుస్తూ సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. మండల కేంద్రమైన నందిగామలో శుక్రవారం సాయంత్రం ప్రమాదకరంగా సామర్థ్యానికి మించి ట్రాలీ ఆటోలో ప్రయాణికులు వెళ్తున్నారు. స్థానికంగా ఉండే పరిశ్రమల నుంచి వలస కూలీలను ఇలా ప్రమాదకరంగా తీసుకెళ్లడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సామర్థ్యానికి మించి ప్రయాణికులు వెళ్తున్న వాహనాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అక్రమ అరెస్టులు అన్యాయం

ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి రాంచంద్రయ్య



పోలీస్‌స్టేషన్ ఎదుట జీపీ కార్మికులు

కేశంపేట: సీఐటీయూ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపు నివ్వడంతో నాయకులను అరెస్టు చేయడం అన్యాయమని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి రాంచంద్రయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పోలీసులు విధుల్లో ఉన్న కార్మికులను అన్యాయంగా అరెస్టు చేశారన్నారు. జీపీ కార్మికులు మండలంలో చలో హైదరాబాద్‌కు వెళ్లలేదని తెలిపారు. అరెస్టు చేసిన జీపీ కార్మికులను పోలీసులు సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో పారేష్, బుచ్చమయ్య, రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ రగడ

ఆమనగల్లు: దుకాణ సముదాయం ప్రారంభానికి తనను ఆహ్వానించలేదని ఆరోపిస్తూ.. సింగిల్‌విండో చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ నిరసన వ్యక్తం చేశారు. ప్రోటోకాల్ పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డులోని షాపింగ్ కాంప్లెక్స్‌ను శుక్రవారం ఎమ్మెల్యే కసిరెడ్డి ప్రారంభించగా.. ప్రభుత్వ కార్యక్రమానికి తనను ఆహ్వానించకుండా అవమానించారని, శిలాఫలకంపై తనపేరు లేదంటూ శిలాఫలకం వద్ద నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యక్రమాలను ఎమ్మెల్యే కసిరెడ్డి.. పార్టీ కార్యక్రమాలుగా భావిస్తున్నారని ఆరోపించారు. రైతులతో ఎన్నుకోబడిన తనను, కాంగ్రెస్ పార్టీ నేతలు ఉద్దేశపూర్వకంగానే అవమానించారని విమర్శించారు. దీనిపై మార్కెటింగ్ శాఖ అధికారులతో పాటు జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. మునుముందు ఇలాంటివి చేస్తే.. అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ సత్యం, నాయకులు రమేశ్‌నాయక్, వెంకటేశ్, సయ్యద్ ఖలీల్, శ్రీనునాయక్, సైదులుగౌడ్ పాల్గొన్నారు.

ఊర్లో ఉన్నారా? లేరా?

- పల్లెల వైపు చూడని ప్రత్యేకాధికారులు
- అటకెక్కిన ప్రత్యేక పాలన!
- నిధులలేమితో కుంటుపడిన అభివృద్ధి
- అప్పుల్లో పంచాయతీ కార్యదర్శులు
- నిలిచిన బిల్లులు, పాస్ కాని చెక్కులు



యాచారం మండల పరిషత్ కార్యాలయం

పంచాయతీల్లో ప్రత్యేక పాలన పడకేసింది. గ్రామాల అభివృద్ధి, ప్రాంత ప్రజల సంక్షేమం గాలిలో దీపంలా మారింది. వెరసి పల్లెలు మసకబారిపోయాయి. స్థానిక పాలకుల గడువు ముగిసిన అనంతరం గ్రామాల్లో పరిపాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. కానీ.. వారు జీపీలను పట్టించుకోవడం లేదని, అసలు వారంటూ ఊర్లో ఉన్నారో.. లేదో తెలియదని ప్రజలు పేర్కొంటున్నారు.

యాచారం: గ్రామాల్లో ఏడాది క్రితం సర్పంచులు, ఎంపీటీసీల పదవీ కాలం ముగిసింది. ఆ తరువాత స్థానిక ఎన్నికలను ప్రభుత్వం నిర్వహించకుండా.. ప్రత్యేక పాలన ఏర్పాటు చేసింది. యాచారం మండలంలోని 24 గ్రామ పంచాయతీలకు అధికారులను నియమించింది. ఇంత వరకు బాగానే ఉన్నా.. పరిపాలనలో ఆ అధికారులు విఫలమయ్యారు. నిత్యం గ్రామాల్లో పర్యటించి, ప్రజా సమస్యలు, గ్రామంలో మౌలిక సౌకర్యాలు తదితర వాటిని పర్యవేక్షించాల్సి ఉంటుంది. కానీ వారు ఏనాడు గ్రామాలకు రావటం లేదని, ఏదో చుట్టపు చూపుగా వచ్చివెళ్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అసలు ఆ సార్లు ఎవరో కూడా మాకు తెలియదని పేర్కొంటున్నారు.

నిధులు లేక.. పనులు చేపట్టక

ప్రత్యేక పాలనలో గ్రామాలను నిధుల లేమి వెంటాడుతోంది. దీంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడింది. ఏడాది కాలంగా పంచాయతీల్లో చెక్కులు పాస్ కావడం లేదు. మండల పరిధిలో రూ. కోటిన్నరకు పైగానే బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. మేజర్ గ్రామ పంచాయతీలైన యాచారం, మాల్, నందివనపర్తి, గునుగల్, నక్కర్తమేడిపల్లి, కొత్తపల్లి, నల్లవెల్లి, మంతన్‌గౌరెల్లి, చింతపట్లలో రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. వివిధ రకాల అభివృద్ధి పనులు, సిబ్బంది జీతాలతో పాటు ఇతర అత్యవసర సమయాల్లో ఖర్చు చేసినవి రూ. లక్షల నిధులు అందాల్సి ఉంది.

అప్పులతో తిప్పలు

గతేడాది సెప్టెంబర్ నుంచి బిల్లులు చేసి, ఎస్‌టీఓకు చెక్కులు పంపుతున్నా పాస్ కావడం లేదు. ఏదో పరిపాలన కోసం కార్యదర్శులు అప్పులు చేసి, ఖర్చు చేయడమే కానీ.. ఎస్‌టీఓలో చెక్కులు పాస్ కాక అప్పుల పాలై తిప్పలు పడాల్సిన దుస్థితి. ఇదిలా ఉండగా.. నిధుల లేమితో గ్రామాల్లో సమస్యలు పేరుకుపోయాయి. తద్వారా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కొదిరోజుల క్రితం మంతన్‌గౌరెల్లి గ్రామంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పర్యటించగా.. అక్కడి సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేకపోవడం, ప్రత్యేకాధికారులు ఎప్పుడు వస్తారో.. పోతారో తెలియడం లేదని పేర్కొన్నారు.

అప్పు పుట్టడం లేదు



యాచారం, చౌదర్‌పల్లి గ్రామాలకు పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాను. గత సెప్టెంబర్ నెల నుంచి బిల్లులు పంపడమే కాని, చెక్కులు పాస్ కావడం లేదు. అప్పు చేసి రెండు గ్రామాల్లో సమస్యలు తీరుస్తున్నాను. ఇప్పటి వరకు రూ. మూడున్నర లక్షలకు పైగా వెచ్చించాను. మరలా అప్పు పుట్టడం లేదు.

– తిరుపతయ్య, పంచాయతీ కార్యదర్శి, యాచారం

ప్రజాసంక్షేమం గాలిలో దీపం



స్థానిక పాలకులు లేరు. దీంతో గ్రామాల అభివృద్ధి కుంటుపడంది. ప్రజా సమస్యలు గాలిలో దీపంలా మారింది. ప్రత్యేక పాలన అటకెక్కింది. ప్రత్యేకాధికారులు ఎప్పుడు వస్తారో, వెళ్తారో తెలియదు. ప్రభుత్వం తక్షణమే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి. పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలి.

– కొప్పు సుకన్య, మాజీ ఎంపీపీ, యాచారం

విధిగా గ్రామాలకు వెళ్లాలి



ప్రత్యేకాధికారులకు కేటాయించిన గ్రామాలకు వారు వారానికి నాలుగు సార్లు వెళ్లాలి. అత్యవసరం ఉంటే నిత్యం వెళ్లాలి. కానీ వారు పల్లెలకు వెళ్లడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. అలా ఉంటే కుదరదు. వెంటనే గ్రామాల్లో పర్యటించి, ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరించాలి. పెండింగ్ బిల్లుల మంజూరు విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

– మాధవరావు, మండల ప్రత్యేకాధికారి, యాచారం